


ఉషోదయం ప్రతి హృదిని పులకరింపజేసి, ఆత్మవిశ్వాసం కలిగించింది. ప్రభాతవేళ కురుస్తున్న మంచుబిందువులు.. సూర్యుడి లేలేత కిరణాలు.. పక్షుల కిలకిలరావాలతో ప్రకృతి మరింత రమణీయతను సంతరించుకోగా.. కాషాయవర్ణంలో ఆకాశం ఆహ్లాదం పంచింది. ఈ సుందరదృశ్యం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం ఆవిష్కృతమైంది.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# ఎస్సారెస్పీ నీటి విడుదల

- కాకతీయ కాలువ ద్వారా సరఫరా
- నీటి విడుదలను ప్రారంభించిన జెన్‌కో సీఈ రమేశ్‌బాబు
- యాసంగి సాగు కోసం 60 టీఎంసీలు కేటాయింపు
- ప్రతినీటి చుక్కను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: అధికారులు



కాకతీయ కాలువకు పూజలు చేస్తున్న ప్రాజెక్టు అధికారులు, స్థానిక నాయకులు

మెండోరా, డిసెంబర్ 18 : యాసంగి సాగు కోసం ఎస్సారెస్పీ నుంచి సోమవారం నీటి విడుదల ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు ఎస్సారెస్పీ జల విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి జెన్‌కో సీఈ రమేశ్, ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్ కాకతీయ కాలువకు నీటి విడుదలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాకతీయ కాలువకు వారబందీ ప్రకారం నీటి విడుదల కొనసాగుతుందని తెలిపారు.ఏడు తడులపాటు నీటి విడుదల చేస్తామన్నారు. కాకతీయ కాలువ ఆయకట్టు రైతులు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1088.60 అడుగుల (78.342 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు. గతేడాది కన్నా రిజర్వాయర్‌లో 12 టీఎంసీల నీటి నిల్వ తక్కువగా ఉందన్నారు. ఈ సీజన్‌లో యాసంగి పంటల కోసం హైదరాబాద్‌లోని శివం కమిటీ ఆధ్వర్యంలో నిర్ణయించిన మేరకు 60 టీఎంసీల నీటిని కేటాయించినట్లు వివరించారు. కాకతీయ కాలువ ఎస్సారెస్పీ హెడ్ రెగ్యులేటర్ నుంచి 65 కిలోమీటర్లు (జోన్–1) ఏడు రోజులపాటు 3,500 క్యూసెక్కులు, కరీంనగర్ (జోన్–2) వరకు మరో 8 రోజులపాటు 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈ నీటి విడుదల వారబందీ ప్రకారం కొనసాగుతుందన్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టుకు 5 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరినట్లు తెలిపారు. మిషన్ భగీరథ తాగునీటి కోసం 6.5 టీఎంసీలు అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఎగువన ఉన్న లిఫ్టులు, సరస్వతీ, లక్ష్మీ, వరద కాలువల ఆయకట్టు రైతులకు సరిపడా నీరు ఉన్నదని తెలిపారు. రైతులు ప్రతినీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని, ప్రాజెక్టు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మిస్బా, ఈఈ చక్రపాణి, కాంగ్రెస్ నాయకులు బురుకల కమలాకర్, అంగరి చంద్రశేఖర్, కె. రమేశ్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

# గుత్ప ఆయకట్టుకు నీటి విడుదల



నీటి విడుదలను ప్రారంభిస్తున్న అధికారులు

నందిపేట్, డిసెంబర్ 18 : గుత్ప ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం నీటి విడుదలను ప్రారంభించారు. నందిపేట్ మండలం ఉమ్మెడ పాత గ్రామం గోదావరి నది ఒడ్డున్న ఉన్న మొదటి శ్రేణి గుత్ప ఎత్తిపోతల పథకం వద్ద ముందుగా పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి మోటర్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. ప్రెషర్ పైపులైన్ ద్వారా బజార్‌కొత్తూర్ శివారులో ఉన్న ఓపెన్ కెనాల్‌లోకి నీరు చేరగా.. అక్కడి నుంచి మాక్లూర్ మండలం ధర్మోర చెరువులోకి వెళ్లాయి. చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని పుష్కలంగా అందిస్తామని, విడుతల వారీగా నీటి విడుదల ఉంటుందని ఎస్ఈ యశ్వి తెలిపారు. రైతులు ఒకరినొకరు సహకరించుకుంటూ సమన్వయంతో సాగునీటిని మళ్లించుకోవాలని కోరారు. ఆయకట్టు అంతటికి నీరందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ భానుప్రకాష్, డీఈ రఘుకుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

## అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 18 : కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. నియోజకవర్గంలో అవినీతిరహిత, పారదర్శక పాలన అందించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తో కలిసి మాట్లాడారు. కలెక్టరేట్ దేవాలయంలాంటిదని, అధికారులు దేవుళ్ల వంటివారని అన్నారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. విధి నిర్వహణలో కొన్ని ఒత్తిడులు వచ్చినా నిబంధనల మేరకు పని చేయాలన్నారు. పరిపాలన శక్తివంతంగా ఉండాలని,విధి నిర్వహణలో మానవతా దృక్పథం నిజాయితీ కలిగి ఉండాలని సూచించారు. తనకు వ్యవస్థ పై గౌరవం ఉందని జనానికి ఉపయోగపడే సమస్యల గురించి మాత్రమే అధికారులను అడుగుతానని స్పష్టం చేశారు.

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు మంచి సమర్థులని తమ శాఖల ద్వారా కేటాయించిన లక్ష్య సాధన కోసం బాగా కృషి చేస్తున్నారన్నారు. ఈ వానాకాలంలో 4 కోట్ల 43 లక్షల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. 5500 మంది వీధి వ్యాపారులకు మూడు దఫాలుగా రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసి దేశంలో అగ్రస్థానంలో నిలిచామన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. కామారెడ్డి పట్టణంలో రెండు రైల్వే వంతెనలు, పది బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు, డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతం

ఇందల్వాయి, డిసెంబర్ 18 : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఎం.అరుణ తెలిపారు. ఈ మేరకు ఆమె ప్రకటన విడుదల చేశారు. ఎంబీఏ, ఎంసీఏ, మూడవ సెమిస్టర్ రెగ్యులర్, ఐఎంబీఏ 9వ సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 537 మంది విద్యార్థులకు 506 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. 31 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

# 'నిజాం షుగర్స్'ను తెరిపిస్తాం..

## బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్, డిసెంబర్ 18: బోధన్ ప్రాంత రైతులు చెరుకు పంటను సాగుచేసేందుకు ముందుకు వస్తే.. తమ ప్రభుత్వం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా బోధన్ నియోజకవర్గానికి సోమవారం వచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నెహ్రూనగర్ నుంచి బోధన్ పట్టణం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని రవిగార్డెన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మానం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చైర్మన్ బి.గంగాశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసుద్దీన్, కాంగ్రెస్ నాయకులు పాషా మొయినుద్దీన్, డి.నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్, బిల్ల రామ్మోహన్, శ్రీనివాస్‌గౌడ్, వై.నరేందర్ రెడ్డి, గణపతిరెడ్డి, పోతారెడ్డి, కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మాధవనగర్ వద్ద..**

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి జిల్లా కేంద్రంలోని మాధవనగర్ వద్ద కాంగ్రెస్ నాయకులు గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాధవనగర్ సాయిబాబా ఆలయంలో పూజలు చేసి బోధన్‌కు వెళ్లారు.